క్లుప్తంగా

ఉపసర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు శిక్షణ

అమర్తలూరు(వేమూరు): మండల పరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచ్, ఇద్దరు వార్డు మెంబర్లకు సోమ, మంగళవారాల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు ఎంపీడీవో శేషమాంబ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుందని వెల్లడించారు. తప్పనిసరిగా హాజరు కావాలని చెప్పారు.

వరద బాధిత కుటుంబాలకు నిత్యావసరాల పంపిణీ



భట్టిప్రోలు: ఇటీవల వరద ముంపునకు గురైన కృష్ణా నది పరీవాహక లంక గ్రామాల్లో బాధితులను ఆదుకునేందుకు విలేజ్ రీకన్‌స్ట్రక్షన్ ఆర్గనైజేషన్ (వీఆర్ఓ) సంస్థ ఆదివారం భట్టిప్రోలు మండలం చింతమోటు యలవర్తి గూడెం, పెదలంక మధ్యగూడెం, పెసర్లంక పల్లెపాలెం, కొత్తగూడెం గ్రామాలలోని 830 కుటుంబాలకు నిత్యావసరాలు పంపిణీ చేసింది. ఒక్కో కుటుంబానికి 10 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, గోధుమ పిండి, వంట నూనె, పచ్చళ్లను అందజేసింది. కార్యక్రమంలో వీఆర్ఓ సంస్థ డైరెక్టర్ ఫాదర్ వేళాంగిణి, లీగల్ అడ్వైజర్, హైకోర్టు సీనియర్ న్యాయవాది తాడిపర్తి బాలస్వామి, విశ్రాంత ఐఏఎస్ అధికారి చక్రపాణి, హైకోర్టు న్యాయవాది జయప్రకాష్, రాజశేఖర్, రేపల్లె సర్కిల్ ప్రతినిధి కె.దేవకి, మేరి, శాంతి, క్లారా, మేరీ కుమారి, సురేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని న్యాయవాది గుంటూరు కృష్ణ పర్యవేక్షించారు.

బీజేపీ మహాసభ్యత్వ అభియాన్ ప్రారంభం



రేపల్లె రూరల్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని బీజేపీ నాయకులు రాంపల్లి జగన్నాథశాస్త్రి చెప్పారు. పట్టణంలోని ఓల్డ్‌టౌన్‌లో ఆదివారం బీజేపీ మహాసభ్యత్వ అభియాన్‌ను ప్రారంభించి మాట్లాడారు. అందరూ బీజేపీ సభ్యత్వ నమోదులో భాగస్తులు కావాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అన్నం సాయివరప్రసాద్, వాకా శివరామప్రసాద్, ఎం.సురేష్, సిమెచ్ కిషోర్‌బాబు, పినపాల సత్యసాయిబాబు, నాగలీల, బోయిన ఉయ్యూరు, సుగ్గుల పూర్ణచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులను ఆదుకోవాలి



భట్టిప్రోలు: వర్షాల వల్ల ఉపాధి కోల్పోయిన చేనేత కార్మికులకు నష్టపరిహారం అందించాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. చేనేత కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం భట్టిప్రోలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించ తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. నాయకులు జి. బాలాజి, మురుగుడు సత్యనారాయణ మాట్లాడారు. ధర్నాను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చేనేత, ఏఐటీయూసీ నాయకులు బి. నాగమల్లేశ్వరరావు, కె. రామకోటేశ్వరరావు, బందారు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

20న తెనాలిలో ధార్మిక శిక్షణ తరగతులు

జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు

తెనాలి: సమరసత సేవా ఫౌండేషన్ తెనాలి మండల కమిటీ సమావేశం ఆదివారం స్థానిక నెహ్రూరోడ్డులోని శ్రీగోవర్ధనస్వామి దేవస్థానం ఆవరణలో నిర్వహించారు. సంస్థ తెనాలి సబ్‌డివిజన్ కన్వీనర్ కడియాల సునీల్ కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ తెనాలి సబ్‌డివిజన్ గ్రామ ధార్మిక సమితి కన్వీనర్ల శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హిందూ ధర్మ రక్షణ కోసం గ్రామ ధార్మిక సమితుల సభ్యులకు అవగాహన కలిగించాలనే భావనతో శిక్షణా తరగతులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా ఈనెల 12న రెండవ శనివారం సత్సంగం, 16 17 తేదీల్లో పౌర్ణమి హారతులు, నగర సంకీర్తన కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. సమావేశంలో మండల కన్వీనర్ దీపాల మహేష్, నగర కన్వీనర్ కోనపురెడ్డి బైరాగి, కొతరపు రామచంద్రరావు, రామాంజనేయులు, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు

ఎరువు.. కరువు..

- డీఏపీ కొరతతో రైతుల ఇక్కట్లు
- మళ్లీ నాట్లు వేసిన ప్రాంతాల్లో ఇబ్బంది
- పట్టించుకోని అధికారులు



డీఏపీ ఎరువులు చల్లని కోడిపర్రులోని పొలాలు

వేమూరు: డీఏపీ ఎరువు కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గతనెలలో భారీ వర్షాలు, వరదల వల్ల పంట పొలాలు పూర్తిగా నీటమునిగాయి. ఫలితంగా రైతులు మళ్లీ నారు కొని, నాట్లు వేశారు. నాట్లు వేసిన పొలాల్లో డీఏపీ ఎరువులు చల్లాల్సి ఉండడంతో ఎరువుల దుకాణాలు, వ్యవసాయ కార్యాలయాలకు క్యూకడుతున్నారు. సహకార సొసైటీల్లోనూ డీఏపీ ఎరువు దొరకడం లేదు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రత్యామ్నాయంగా 20-20 ఎరువు వాడుతున్నట్టు రైతులు చెబుతున్నారు. వేమూరు నియోజకవర్గంలో ఈ ఖరీఫ్‌లో 95 వేల ఎకరాల్లో వరి సాగు చేయగా, 20 వేల ఎకరాల్లో వరి పొలాలు నీటమునిగాయి. రైతులు మళ్లీ నాట్లు వేసి డీఏపీ ఎరువు దొరక్క పాట్లు పడుతున్నారు. 20-20 ఎరువు ధర బహిరంగ మార్కెట్లో కన్నా అధిక సహకార సొసైటీల్లో ఎక్కువ ఉండడంతో రైతులు ఆశ్చర్యపోతున్నారు. సొసైటీల్లో దీని ధర రూ.1,180 ఉండగా, బయట రూ.1,150కి అమ్ముతున్నారు. వరద ప్రభావిత గ్రామాల్లో ఉచితంగా డీఏపీ అందించాలని రైతులు కోరుతున్నారు. వరి నాట్లు వేసిన 30 రోజుల్లో డీఏపీ వాడితే వరి బాగా దుబ్బు చేస్తుందని చెబుతున్నారు.

డీఏపీ దొరకట్లేదు



వర్షాల వల్ల మా పొలం మునిగిపోయింది. మళ్లీ వరి నాట్లు వేశాం. మొదటి విడత డీఏపీ చల్లాలి. ఆ ఎరువు కోసం షాపుల చుట్టూ తిరుగుతున్నా.. దొరకడం లేదు. ఏం చేయాలో పాలుపోక చివరకు 20-20 వేశాం.

– సిద్దెల రాజకిషోర్, కౌలు రైతు, పెనుమర్రు, వేమూరు

డీఏపీ కొరత తీర్చాలి



కనీసం తర్వాతైనా డీఏపీ ఎరువును అందుబాటులో ఉంచాలి. రెండో విడతలో డీఏపీ వాడతాం. అధికారులు ఈ దిశగా చర్యలు చేపట్టాలి. ప్రస్తుతం డీఏపీ వాడకపోవడంతో వరి దుబ్బు చేయడం లేదు.

– అలపర్తి రవి, జంపని, వేమూరు.

చర్యలు తీసుకుంటాం

రైతులకు డీఏపీ ఎరువు అవసరమనే విషయం మా దృష్టికి రాలేదు. ఎరువుల షాపుల యాజమాన్యాలతో మాట్లాడి డీఏపీ ఎరువు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఏ ఇబ్బంది ఉన్నా.. అధికారులను సంప్రదించాలి.

–చందోలు సునీత, వ్యవసాయాధికారి, వేమూరు

మేరుగకు స్వాగతం



మేరుగ నాగార్జునకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలుకుతున్న నాయకులు

బాపట్ల: వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జునకు ఆ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. జిల్లా అధ్యక్షులుగా నియమితులైన తర్వాత తొలిసారి బాపట్లకు రావడంతో ఆయనను కలిసేందుకు నాయకులు భారీగా తరలివచ్చారు. ఆయనకు స్వాగతం పలికిన వారిలో వైఎస్సార్ సీపీ పట్టణ, మండల అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, కోకి రాఘవరెడ్డి, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, యల్లావుల ఏడుకొండలు, నాగేశ్వరరెడ్డి, జోగి రాజా, వడ్డిముక్కల డేవిడ్, చల్లా రామయ్య,సుభానీ తదితరులు ఉన్నారు.

బాపట్ల మున్సిపల్ కమిషనర్‌గా రఘునాథరెడ్డి



బాపట్ల: బాపట్ల మున్సిపల్ కమిషనర్‌గా జి.రఘునాథరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రొద్దుటూరు కమిషనర్‌గా పని చేస్తున్న రఘునాథరెడ్డిని బాపట్లకు, బాపట్ల కమిషనర్‌గా పని చేస్తున్న నిర్మల్‌కుమార్‌ను మాతృసంస్థ స్వచ్ఛాంధ్రకు బదిలీ చేశారు. బాపట్ల మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న నిర్మల్‌కుమార్‌ను కేవలం మూడునెలల్లోనే బదిలీ చేయటం పట్టణంలో చర్చనీయాంశమైంది.

ట్రాఫిక్ సమస్య జటిలం



భట్టిప్రోలు చావలి బస్టాండ్ సెంటర్‌లో ఎదురెదురుగా ఇదీ దుస్థితి



భట్టిప్రోలు గ్యాస్ కంపెనీ వద్ద ఇదీ పరిస్థితి

భట్టిప్రోలు: భట్టిప్రోలులో ట్రాఫిక్ సమస్య జటిలమవుతోంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రహదారుల విస్తరణ జరగకపోవడంతోపాటు ఆక్రమణల వల్ల ఉన్న రోడ్లు మరింత కుచించుకుపోతున్నాయి. ఫలితంగా ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపి పరిస్థితిని గాడిలో పెట్టాల్సిన పంచాయతీ, ఆర్అండ్‌బీ శాఖల అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. ముఖ్యంగా చావలి బస్టాండ్, రథం సెంటర్, గర్డర్ బ్రిడ్జి సెంటర్లు ఆక్రమణలకు గురికావడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఎరువులు, కలప, అడితీ, సిమెంట్, నాపరాయి వ్యాపారాలు చేసేవారూ రోడ్లపైనే లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తుండడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కళాకారులకు తెనాలిలో 'రంగస్థల దసరా'

'వీణా అవార్డ్స్' నాటకోత్సవాల బ్రోచర్ ఆవిష్కరణలో సాయిమాధవ్ బుర్రా



తెనాలి: రాష్ట్రంలోని కళారంగంలోని వారికి తెనాలిలో రంగస్థల దసరా ఆరంభమవుతోందని కళల కాణాచి వ్యవస్థాపకుడు, సినీ రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా అన్నారు. వేదగంగోత్రి ఫౌండేషన్– విజయవాడతో కలిసి తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఈనెల 7–12 తేదీల్లో జరగనున్న వీణా నాటకోత్సవాల బ్రోచర్‌ను ఆదివారం స్థానిక గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. జాతీయస్థాయి చతుర్థ సాంఘిక పద్య నాటక, సాంఘిక నాటక, నాటికల పోటీల వివరాలను తెలియజేశారు. తొలిరోజున జిల్లాకు చెందిన నాటకరంగ దిగ్గజాలు వల్లూరు వెంకట్రామయ్య చౌదరి, కొడాలి గోపాలరావు, కన్నెగంటి నాసరయ్య, బెల్లంకొండ రామదాసు శతజయంతి ఉత్సవాల సదస్సు, వారి పేరిట ప్రస్తుత రంగస్థల నటులు/రచయితలకు అవార్డుల ప్రదానోత్సవం ఉంటుందన్నారు. మధ్యలో శ్రీదుర్గాభవాని నాట్యమండలిచే శ్రీకృష్ణరాయబారంలో నాటక సన్నివేశ ప్రదర్శన ఉందన్నారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటలకు సమకాలీన సాంఘిక పద్య నాటకం, మధ్యాహ్నం 2 గంటలకు సాంఘికనాటకం, సాయంత్రం రెండేసి నాటికల చొప్పున ప్రదర్శనలు ఉంటాయన్నారు. తొలిరోజున పద్మభూషణ్ ఏఆర్ కృష్ణ జాతీయ రంగస్థల పురస్కారాన్ని ప్రముఖ రంగస్థల నటుడు, దర్శకుడు, విశ్లేషకుడు డాక్టర్ డీఎస్ఎన్ మూర్తికి ప్రదానం చేస్తారు. ముగింపురోజైన 12న ప్రఖ్యాత రంగస్థల నటుడు బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి జాతీయ రంగస్థల పురస్కారాన్ని రాష్ట్రంలోని పేరెన్నికగన్న రంగస్థల నటుడు యడ్ల గోపాలరావుకు ప్రదానం చేస్తామని వివరించారు. మళ్లీ కొత్తగా తీసుకొస్తున్న సాంఘిక పద్యనాటకాలతో సహా ఆయా రోజుల్లో ప్రదర్శనలను ప్రజలు ఆదరించాలని డాక్టర్ సాయిమాధవ్ కోరారు. కళల కాణాచి ప్రధాన కార్యదర్శి గోపరాజు విజయ్, కోశాధికారి దేవరపల్లి భవాని, ఉపాధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు ఎవరైనా టెండర్లు వేయొచ్చు

తెనాలి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం

తెనాలిరూరల్: మద్యం దుకాణాలకు ఎవరైనా టెండర్లు వేయవచ్చని తెనాలి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు ఆన్‌లైన్‌లో లేదా తమ కార్యాలయంలో టెండర్లు వేయవచ్చని చెప్పారు. ఆన్‌లైన్ బ్యాంకింగ్ ద్వారా నిర్దేశిత రుసుము రూ. 2 లక్షలు చెల్లించవచ్చని, లేదా ఎక్సైజ్ కార్యాలయంలో నగదు చెల్లించి/ డీడీ తీసి టెండరు వేయవచ్చని పేర్కొన్నారు. ఒకే షాపునకు ఒకే వ్యక్తి ఎన్ని టెండర్లయినా వేయవచ్చని తెలిపారు.

వైద్యశిబిరాలకు విశేష స్పందన



చెరుకుపల్లిలో రోగులను పరీక్షిస్తున్న శంకర కంటి ఆస్పత్రి వైద్యులు డాక్టర్ మార్యా ఫారూక్



కర్లపాలెంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ చల్లా రామోహన్‌రావు



వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు, వైద్య సిబ్బంది

చెరుకుపల్లి/భట్టిప్రోలు/కొల్లూరు/కర్లపాలెం: గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఉచిత కంటి, వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు కనగాల హాజీ మహమ్మద్ ఖాసీమ్ సాహెబ్ మమమ్మద్ గాలాబ్ సాహెబ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్మన్ అబ్దుల్ సమ్మద్ చెప్పారు. కనగాల బీఈడీ కళాశాల ఆవరణలో వారి సహకారంతో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ఒంటి గంట వరకు పెదకాకాని శంకర కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో కంటి, కిడ్నీ వైద్యశిబిరం నిర్వహించారు. రోగులకు వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందించారు. ఈ శిబిరంలో 200 మందికి పరీక్షలు నిర్వహించగా 110 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని వైద్యులు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు షేక్ ఫారూక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

■ భట్టిప్రోలు అద్దేపల్లి సిద్ధార్థ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో ఆదివారం తెనాలి శ్రీ లక్ష్మి విజన్ కేర్ సెంటర్ అధినేత డాక్టర్ పంచుమర్తి భాస్కరరావు ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 125 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వి. నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ వి. భారతి, ఉపాధ్యాయులు జొన్నాదుల రమేష్, ఆంద్రూస్ సువర్తన రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

■ కొల్లూరు బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఆల్‌బెన్నీ ఆంధ్ర అసోసియేషన్, తెనాలికి చెందిన రెయిన్‌బో ట్రస్టు ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 400 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గుంటూరు ఒమేగా వైద్యశాలతోపాటు, పలువురు వైద్యులు స్వచ్ఛందంగా శిబిరంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైద్యులు సీహెచ్ ఉదయభాస్కర్, టి.అఖిలేష్, అరుణ, కె.సంధ్య, వైద్య సిబ్బంది కుమారి, అయ్యప్ప పాల్గొన్నారు.

■ కర్లపాలెం రామకృష్ణ సేవా సమితిలో ఆదివారం పేరలి నరసయ్య మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 100 మంది మధుమేహం, రక్తపోటు వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. వైద్యులు చల్లా రామ్మోహన్‌రావు, రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు టీవీ సుబ్బారావు, వ్యవస్థాపకులు కాటూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లలితా నమోస్తుతే..

బాపట్ల జిల్లా కొల్లూరు మండలం ఈపూరులో ఉన్న కనకదుర్గమ్మ దేవస్థానంలో ఆదివారం అమ్మవారిని లలితా త్రిపురసుందరీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.





భట్టిప్రోలు మండలం వెల్లటూరులో అన్నపూర్ణా దేవిగా..



నగరం మండలం మీసాలవారిపాలెంలో..



అమర్తలూరు మండలంలోని పాంచాళ వరంలో..

తల్లీ.. ప్రణమిల్లీ..

బాపట్ల, వేమూరు, రేపల్లె నియోజకవర్గాల్లో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారి ఆలయాలతోపాటు, పలు చోట్ల వెలిసిన మండపాల్లో కనకదుర్గను భక్తులు ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు. ఆదివారం వివిధ అలంకారాల్లో అమ్మవారు కరుణించారు. కొన్నిచోట్ల లలితా త్రిపుర సుందరీదేవిగా కటాక్షించారు. ప్రత్యేక కుంకుమార్చనలతోపాటు అన్నసమారాధనలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మను కొలిచారు. నమోస్తుతే అంటూ ప్రణమిల్లారు.

– చెరుకుపల్లి/వేమూరు/భట్టిప్రోలు/నగరం/రేపల్లె రూరల్/కర్లపాలెం



చెరుకుపల్లి మండలం రాజవోలులో మహాకాళికాదేవిగా..



చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లి ఆనందీశ్వర దేవస్థానంలో లలితాత్రిపుర సుందరీ దేవిగా



రేపల్లెలో లలితా త్రిపుర సుందరిదేవిగా భక్తులకు దర్శనమిస్తున్న వాసవీ మాత



కర్లపాలెం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో..



భట్టిప్రోలు వాసవీ మాత ఆలయంలో బాలికల కోలాటం

కార్తిక వనసమారాధన పోస్టర్ ఆవిష్కరణ



తెనాలి: 13వ చంద్రవంశ క్షత్రియ యాదవరాజుల కార్తీక వనసమారాదన నవంబరు 13వ తేదీన జరుగుతుందని యాదవ సంఘీయులు వెల్లడించారు. స్థానిక రైల్వేస్టేషను రోడ్డులోని బృందావన్ హోటల్ కాన్ఫరెన్సు హాలులో ఆదివారం మధ్యాహ్నం వనసమారాధన మహోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. పట్టణ సుల్తానాబాద్‌లోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో జరిగే వన సమారాధనలో యాదవ సంఘీయులు వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ తాడిబోయిన అవినాష్, ప్రముఖ న్యాయవాది తాడిబోయిన శ్రీనివాసరావు, తెనాలి మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధికా రమేష్, కౌన్సిలరు తాడిబోయిన రామయ్య, రెయిన్ బో పాఠశాల చైర్మన్ దొడ్డక ఆదినారాయణ, బ్యాంక్ న్యాయసలహాదారు తాడిబోయిన బుచ్చిరాజు, తాడిబోయిన లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.